# 30. అపరిచితుడు

"మీపక్క కొంచెం అవతలికి లాక్కుంటారా?" అతను ఒక విచిత్ర మృగాన్ని చూచినట్టుగా నావైపు చూచి విసుగుతో సణుక్కుంటూ పక్క అవతలికి లాక్కొని నాకు స్థలంచూపాడు. ప్యాసింజర్లు పడుకొనే మామూలు హాలుమీద ఎవరికీ ప్రత్యేక అధికారం లేదు కనుకనే నేను అతన్ని లెక్క చెయ్యలేదు. విశేషించి మొట్టమొదటి చూపుల్లోనే నన్ను బాగా ఆకర్షించగలిగిన వ్యక్తుల్లో అతనొకడు. అతని పరిచయం చేసుకోవాలని వుందికాని, ఆ రాత్రి అతని ప్రవర్తన నాకు యేమీ బాగుండలేదు.

ఉదయాన హోటల్ మేనేజరు దగ్గర్నుంచి – రాత్రి దొంగల భయంచేత దాచుకొన్న – రెండువందల రూపాయిల చిల్లర్నా లెక్కించు కుంటూన్నా. అతను ప్రవేశించి పదిగజాల దూరంలో నిలబడివుండటం నేను గమనించకపోలేదు. ఇంత డబ్బూ అతన్ని తప్పకుండా ఆకర్షించి తీరుతుందనే నమ్మకంతో చూసిన నా ఓరకంటిచూపుకు నిరాశే కలిగింది. అతనిలో ఏ అయస్కాంతశక్తి వుందోకాని అతన్నొక మిత్రుణ్ని చేసుకోవాలనే నాకోర్కె క్షణక్షణాభివృద్ధి అవజొచ్చింది. కాని అతను నామీదా, నా హోదామీదా చూపే నిర్లక్షతకు, నా ఆత్మాభిమానం కూడా కలిసి – నా కోర్కెను కొంతవరకూ వెనక్కులాగినై.

ఆ హోటల్‌కు నేను కొత్తవాణ్ని కాదుకాని, ఆనాటి సంఘటన మాత్రం నాకు కొత్తదీ, ఆశ్చర్యాన్ని కూర్చేదీ అయింది. జార్జిటౌన్‌కు వచ్చేలోపల స్నానంచేసి ఆరేసిన పెద్ద టర్కిష్‌టవల్‌కు కాళ్లొచ్చి మాయమైంది. ఈ స్వల్ప విషయాన్ని గూర్చి మేనేజరుతో చెప్పలేదుకాని "మాలో ఎవరు దొంగ?" అన్నట్టు హాలులోని వ్యక్తులందరి వైపూ చూశాను. కాని ఆ చూపుకు ఏమాత్రపు విలువా లేకపోయింది.

మర్నాడు బద్ధకం కొద్దీ బెడ్డింగులోనే ఉంచిన ఆకుపచ్చ బ్లేజరు కోటు మాయాబజార్ వస్తువుల్లో జమపడటంతో కాని నాకు వేడిపుట్టలేదు.

మేనేజరుతో ముందుగా యీ సంగతి చెప్తే అతను నవ్వుతూ, "అందుకనే స్పెషల్‌రూమ్, తీసుకోమంటాం సార్!' అన్నాడు, సరిగ్గా నాతప్పు ఎక్కడుందో వేలుపెట్టి చూపుతూన్నట్టు. వారానికి రెండు చేతుల రూపాయిలు దర్శించుకొని స్పెషల్‌రూమ్ తీసుకోవటంకన్నా – వారానికి ఒక సెకండ్ హేండెకోటును పోగొట్టుకోవటమే లాభదాయక మనిపించాయ్ – ఆయన మాటలు..

కాని రోజూ ఇది మామూలైతే ఇబ్బందే! మోజుపడి ఆ కోటును మూడేళ్ళ క్రితం పెళ్ళికి కుట్టించుకొన్నాను. ఆనాడు బ్యాండుమేళాల్తో ఊరేగిన ఆ కోటు యీనాడు ఎక్కడ ఊరేగుతోందో ననుకుంటూ పరిచయమున్న ముగ్గురు నలుగురితోటి

ప్యాసింజర్లతో ఈ దొంగతనం విషయాన్ని విశదీకరించాను. నాకు పదిగజాల దూరంలో పాతకంబళీమీద పడుకొని పాతపత్రికను చదువుకుంటూన్న ఆ "అపరిచితుడి"కి కూడా నా మాటలు విన్పించినయ్. కాని అతని ఏకాగ్ర పఠనానికి అవి చలనం కలిగించలేదు. నా మాటలు విన్న పెద్ద మనుషులు, అందరూ "వచ్చేపొయ్యేచోటు - జాగ్రత్తగా ఉండాలిసార్!" అన్నారు - నా తప్పుగానే!

మర్నాడు ఐదు బ్యాటరీలలైటూ, సిల్కు ఉత్తరీయమూ రెండూ కలిసి మాయమయ్యాయ్. ఒక్కొక్కటి పొయ్యే రివాజు - ఒక్కసారి రెట్టింపుగా పెరగటంతో నాకు అదురు పుట్టింది. వేసినసీళ్ళు వేసినట్లుగా బెడ్డింగు కదలకుండానే లోపలివస్తువులు జారుకొంటున్నయ్. ఈ విధంగా మరో వారం రోజులు గడుస్తే నేను బరువంతా హెూటల్లోనే వదిలించుకొని, లైసెన్స్ కూలీల సహాయం లేకుండానే ఇల్లు జేరొచ్చు. ఈ హాల్లో మెస్మరిజమో, గారడీయో చేసే వ్యక్తో లేక సమ్మోహనాస్త్ర ప్రయోగం తెలిసినవాడో జేరాడనే విషయం దృఢపడ్డది. ఎవరితో మొరపెట్టుకొన్నా ప్రయోజనం ఉండేట్టు కన్పించలేదు. పోనీ నేనే ఆ గజదొంగ ఎవరో పట్టుకొని, నా సోదర ప్రయాణీకులు నాలాటి బాధలకు గురి కాకుండా ఉండేట్టు చేద్దామనుకొన్నాను కాని, దొంగ ఎవరో తెలిసేటంతవరకూ నా వస్తువులు మరికొన్ని కబళింప బడటం తప్పదని ఊరుకొని - హెూటలు మేనేజరుగారి సలహానే కిక్కురు మనకుండా అనుసరించా.

## 2

అంత పెద్ద గదిలోనూ నా ప్రతిబింబాన్ని మాత్రం రెండో వ్యక్తిగా భావించుకుంటూ కూర్చోవటం నాకు చాలా విసుగ్గా వుంది. నలుగురూ తిరిగే హాలులో అనేక రకాల ముఖాల్ని చూస్తూంటేనే పొద్దుపొయ్యేది. ఏమైనా మరి మూడురోజులే యీ ఏకాంత వాసమనే ఊరడింపుతో - ఓపికతో చదువుకుంటూన్న సమయంలో - దగ్గరగావేసి వున్న తలుపు తెరువబడ్డది. అతను ద్వారంలో నిలబడి వున్నాడు. నన్ను ఆకర్షించిన వ్యక్తి తనంత తనే వచ్చాడని, "రాండి' అన్నాను.

అతను ప్రవేశించి నా పక్కనే ఖాళీగావున్న కుర్చీలో కూలబడి గది నంతటినీ పరికించాడు. మరి రెండు నిమిషాల నిశ్శబ్దతను తోసిపుచ్చేందుకు ప్రయత్నించే వాడిలాగు ఏదో చెప్పబోయి ఆగుతున్నాడు. దెబ్బలు తప్పించుకుందామని వచ్చీరాని పాఠాన్ని అప్పగించేందుకు ప్రయత్నించే మూడో క్లాసు కుర్రాడు నాకు జ్ఞాపకాని కొచ్చేడు.

"ఏమండీ?" అన్నాను ప్రశ్నార్థకంగా.

అతను మాట్లాడకుండా జేబులోంచి పార్కర్ ఫౌంటెన్ కలాన్నితీసి నాచేతికిచ్చేడు. దాన్ని పరిశీలించి చూసి అది ఎందుకు నా చేతులోకి వచ్చిందీ తెలియక "నాకు కలాన్ని బాగుచెయ్యటం తెలియదు-" అన్నాను.

"అది కాదు కలం చూడండి. ఎంత ఖరీదుంటుంది?" అన్నాడు.

నేను కలాలవ్యాపారాన్ని ఎప్పుడూ చేసివుండక పోవటమూ, కనీసం ఆ బాపతు క్యాటలాగుల్ని ఒక్కసారయినా చూచివుండకపోవటమూ నాకు పెద్ద ఇబ్బందైంది.

"ఎంతకు కొన్నారు?" అన్నాను.

"ఎంతకు కొనొచ్చు?" మళ్ళీ ఆ ప్రశ్నను నాకే అంటకట్టాడు.

"నాకు బాగా తెలియదండీ–"

"సుమారుగా చెప్పండి."

ఎంత చెప్దామా అని ఆలోచిస్తున్నా, ఏం చెప్తే ఏమొస్తుందో ననుకుంటూనే, "ప....ది...." అని తరువాత "హేను" లేక "ఏడు" అని కలపటాన్ని గూర్చి విచారిస్తున్నా (ఒకసారి ఇల్లాటి సమస్య ఒక పజిల్‌లో వస్తే మహా అవస్థపడ్డ మిత్రుడొకడు జ్ఞాపక మొచ్చాడు)

"పదమూడు" అని అతను పూరించాడు.

అప్పటి నా ముఖం – కీసొల్యూషన్ ప్రకటింపబడ్డాక పైన చెప్పిన మిత్రుని ముఖభంగిమకు ఇమిటేషన్‌గా తయారై వుంటుంది!

"ఇంతకూ ఏమిటి? అన్నట్టు అతని వైపుచూశా.

"రాసిచూడండి. కొని పదిరోజు లవుతుంది–" అన్నాడు కలాన్ని నాకు అందిస్తూ.

రాసి, "చాలా బాగుంది" అని రిమార్కు చేశాను. అతను మళ్ళీ ఏదో చెప్పబోయి సంకోచిస్తున్నాడు. బెదురుచూపులు తృళ్ళిపడే అతని హృదయాన్ని వ్యక్త పరుస్తున్నయ్.

కాస్త ఆగి అన్నాడు : "ఈ కలాన్ని మీ దగ్గర వుంచుకొని ...నా కొక ఐదురూపాయిలు...ఇవ్వగలరా?"

దీనంగా అడిగిన అతని మాటలు నాలో వివిధ భావాల్ని రేకెత్తింప జేసెయ్. తాకట్లమీద డబ్బు అరువు ఇచ్చే వ్యాపారమూ నాకు తెలియదు. ఐనా నేను మాత్రమే ఇతని దృష్టికి అందట మేమిటి? అసలు ఇది అతనిది అవునో? కాదో?

"మూడుపూటలనుంచీ భోంచెయ్యలేదు...డబ్బు పంపమని ఇంటికి రెండు ఉత్తరాలు రాసేను...ఇవ్వాళ తప్పితే రేపూ మీ డబ్బు ఇచ్చేసి కలం తీసుకుపోతాను" అన్నాడు జాలిగా "నీవేతప్ప నితఃపరంబెరుగ" అన్నట్టు చూస్తూ.

నాకు చాలా జాలి కలిగింది. ఒకసారి తప్పనిసరిగా ఒక పూట పస్తుపడుకోవాల్సి వచ్చినపుడు నేను పడ్డబాధను మూడింతలుగా ఊహించుకొని అతనికి డబ్బిచ్చాను. తృప్తిగా కృతజ్ఞతతో నావైపు చూశాడు.

కలాన్ని నా కివ్వబొయ్యాడు.

'ఫర్వాలేదు ఉంచుకోండి...' అన్నాను.

కలం మరిచిపోయి పోస్టాఫీసు దగ్గరపడ్డ అవస్థకూడా నాకు తెలుసుకనుకనే ఆ మాట అన్నాను. అతను మాట్లాడకుండా బైటికినడిచాడు.

## 3

ఆ రాత్రి మెయిల్‌కు వెళ్ళిపోతూ అతను కన్పిస్తాడేమో నని చూశాను. ఇంతలో టైం అవటంవల్ల బయలుదేరాను. దార్లో హొటల్ కుర్రాడొకడు కన్పించి ఒక కవరిచ్చాడు. తొందరలో దాన్ని చూడకుండానే జేబులో పెట్టుకొన్నాను.

రైల్లో తాపీగాపడుకున్న తరువాత సిగరెట్‌కోసం జేబులోకివెళ్ళిన చేతికి కవర్ తగిలింది...తీసి చదివాను.

"కొన్ని దినాలక్రితంవరకూ జీవితంలో మోసపొయ్యానే కాని, మోసంచేసి ఎరుగను. సద్వంశంలో పుట్టి పదిహేను సంవత్సరాలు కృషిచేసి సంపాదించిన బి.ఎ. పట్టా నన్ను యీ లోకానికి ఒక కొరగాని తృణంగా తయారు చేసింది. ఈ విశాలవిశ్వంలో నన్ను ఉపయోగించుకొనే విధానం ఎవ్వరికీ తెలియదు. మెడ్రాస్ లాటిపట్టణం నాలాటి నిరాధారుడికి, నిస్సహాయుడికి ఏదైనా దారి చూపుతుందని భ్రమించివచ్చి మూడు నెల్ల కాలాన్నీ వృథాచేసుకొన్నాను. తోటిమానవుల మీద నిర్లక్ష్యత ఏర్పడ్డది. బీదరిక భారంతో కృంగి కృశించిపోతూన్న నా వ్యక్తిత్వమూ, నా ఆశయాలూ నన్నొక పశుతుల్యుడిగా చేసెయ్...చివరికి మీరున్న హొటలులోనే సర్వింగ్‌కుకూడా తయారైనా, పూవులమ్మిన చోటనే కట్టెలమ్మేందుకు సిద్ధమైనా నాకు గుర్తింపు లేకపోయింది. గత్యంతరంలేకనే చిన్న చిన్న దొంగతనాలు ప్రారంభించాను. నా పైన పనిచేసే వాతావరణ మహాత్మ్యమే నన్ను యీస్థితికి లాగింది. పాప పుణ్యాలూ, తప్పొప్పులూ నాకు కన్పించటంలేదు. జీవితంభారమై నన్ను నేనే మరచి ప్రవర్తించేట్టుచేస్తోంది. మీ పోయిన వస్తువులన్నింటినీ నా చేతులమీదనే తెగ నమ్మాను. నాది తప్పే కావొచ్చు. నాకు శిక్ష అవసరమే అవొచ్చు. కాని యీ మానవాధముల చేతుల్లోకాదు - నా ఖర్మ నాకు ప్రసాదించాలి. నేను భయపడికాదు, మీ దర్శనం చేసుకోంది...నాకే ముఖం చెల్లలేదు. మిమ్ము తప్పుగా అర్థం చేసుకొన్నాను. మీకన్న ఉత్తముల విషయంలో కూడా అంతేనేమో! నన్ను మన్నించండి. ఏనాడో శ్రీకృష్ణ జన్మస్థానానికి వెళ్తాను. అప్పుడు కూటి కోసం విచారించవలసిన పనివుండదు....

**- అపరిచితుడు'**

ఉత్తరం పూర్తయ్యే టప్పటికి మానవ సహజమైన సానుభూతి - ఆ అపరిచితుడికోసం రెండు కన్నీటి బిందువుల రూపాన సాక్షాత్కరించింది!

*- జూన్, 1941*